## క్లుప్తంగా

### మద్దిలేటయ్యను దర్శించుకున్న న్యాయమూర్తులు



బేతంచెర్ల: మండల పరిధిలోని వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయాన్ని హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సురేష్ కుమార్ రెడ్డి, జస్టిస్ శ్రీనివాసరెడ్డి, జస్టిస్ హరినాథ్, జిల్లా జడ్జి శ్రీనివాసరావు, జూనియర్ సివిల్ జడ్జి రాహుల్ అంబేడ్కర్, జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి దర్శించుకున్నారు. వారికి ఈఓ పాండు రంగా రెడ్డి, చైర్మన్ రామచంద్రుడు, వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామి, అమ్మవార్ల ప్రత్యేక పూజల అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. డోన్ ఆర్డీఓ వెంకట రెడ్డి పాల్గొన్నారు.

### విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

బేతంచెర్ల: మండల పరిధిలోని ఎంబాయి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు శనివారం ప్రభుత్వం మంజూరు చేసిన ట్యాబ్‌లను హెచ్ఎం పురుషోత్తం రెడ్డితో కలిసి సర్పంచ్ యుగంధర్ రెడ్డి అందజేశారు. పేదల విద్యాభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఈ సందర్భంగా సర్పంచ్ విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉమా మహేశ్వరయ్య, శేఖర్ నాయక్, పాండు రంగయ్య పాల్గొన్నారు.

### కూరగాయల మార్కెట్‌ను పరిశీలించిన చైర్మన్

డోన్ టౌన్ : పాత బస్టాండ్‌లో రూ.16 కోట్లతో నిర్మించిన ఆధునిక కూరగాయల మార్కెట్‌ను శనివారం డీఈ రసూల్, ఏఈ సతీష్‌లతో కలిసి మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ పరిశీలించారు. ఆధునిక వసతులతో నిర్మించిన మార్కెట్‌ను ఆదివారం మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రారంభించనున్న నేపథ్యంలో చైర్మన్ ఏర్పాట్లపై ఆరా తీశారు. సుందరంగా ముస్తాబు చేయించాలని అధికారులకు చైర్మన్ సూచించారు.

### ఉత్తమ ఎంపీడీఓకు సన్మానం



ఎంపీడీఓను సన్మానించిన ఉద్యోగులు

బనగానపల్లె రూరల్ : గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఎంపీడీఓగా జిల్లా కలెక్టర్ మనజీర్‌జిలానిసామూన్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్న శివరామయ్యను ఉద్యోగాలు, ప్రజాప్రతినిధులు అభినందించారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓకు పూలమాలలు వేసి శాలువాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఏపీ ఎన్జీఓ సంఘం అధ్యక్షులు నల్లగట్ల వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ ఏఈ మహేష్ విద్యుత్ శాఖ డీఈఈ మద్దిలేటి ఏఈ శ్రీనివాసులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**సత్కారం**

డోన్ టౌన్ : గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ సబ్ రిజిస్ట్రారుగా ప్రశంసా పత్రం అందుకున్న బజారును శనివారం ఘనంగా సన్మానించారు. డోన్ కార్యాలయం సిబ్బంది డాక్యుమెంట్ రైటర్లు అసోసియేషన్ నాయకులు ఇస్మాయిల్, ఆలా మోహన్‌రెడ్డి, సముద్రాల లక్ష్మీనారాయణ, అబ్దుల్లా, జాకీర్, నజీర్, శ్రీనివాసగౌడ్ తదితరులు ఆయనకు మెమెంటో అందజేసి సత్కరించారు.

### రేపు ఉచిత వైద్య శిబిరం

డోన్ టౌన్ : పట్టణంలోని ఆయుర్వేద ఆసుపత్రి( రైల్వే స్టేషన్ రోడ్డులోని చింత చెట్ల వద్ద)లో ఈ నెల 29వ తేదీన ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యురాలు గ్రేస్ సెలప్షియల్ తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ దీర్ఘకాల వ్యాధులకు క్రమం తప్పకుండ ఆయుర్వేద మందులు వినియోగిస్తే నయం చేసుకోవచ్చన్నారు. కీళ్ల నొప్పులు, ఆస్మా, స్త్రీ, చర్మ తదితర వ్యాధులకు ఉచితంగా పరీక్షలు, చికిత్సలు చేస్తామని, సద్వినియోగం చేసుకోవాలన్నారు.

**విజేతలకు అభినందనలు**

డోన్ టౌన్ : ఆడుదాం ఆంధ్రలో భాగంగా శనివారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి కబడ్డీ, క్రికెట్ విజేతలను మున్సిపల్ చైర్మన్ రాజేష్ అభినందించారు. కబడ్డీ ప్యాపిలి పురుషుల జట్టు విన్నర్, బేతంచెర్ల జట్టు రన్నర్‌గా నిలువగా, మహిళా విభాగంలో డోన్ మొదటి స్థానం, బేతంచెర్ల ద్వితీయ, ప్యాపిలి జట్టు తృతీయ స్థానంలో నిలిచాయి. వీరిని చైర్మన్‌తో పాటు కమిషనర్ వెంకట్రామిరెడ్డి అభినందించారు. కార్యక్రమంలో పీఈటీలు సుధాకర్, నారాయణ, నాగరాజు, లక్ష్మీ ప్రభావతి, సుజాత ఉన్నారు,

# వంద పడకల ఆసుపత్రి ముస్తాబు



గుత్తిరోడ్డు రూ. 40 కోట్లతో నిర్మించిన డోన్ ఏరియా ఆసుత్రి



పాతబస్టాండ్‌లో రూ. 16 కోట్లతో నిర్మించిన ఆధునిక కూరగాయల మార్కెట్‌కు సంబంధించి ఓ భాగం

- రూ. కోట్ల వెచ్చించి హాస్పిటల్‌తోపాటు కూరగాయల మార్కెట్, ఎస్సీ, బీసీ హాస్టళ్లు, స్విమ్మింగ్ ఫూల్ నిర్మాణం
- నేడు ప్రారంభించనున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి
- హాజరుకానున్న ఎంపీ పోచా, జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి

డోన్ : ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రత్యేక చొరువతో డోన్ మోడల్ నియోజకవర్గంగా రూపుదిద్దుకుంటుంది. మండల కేంద్రాలతోపాటు గ్రామాలు విశాలమైన రోడ్లు, ప్రభుత్వ భవనాలతో కళకళలాడుతున్నాయి. ప్రత్యేకించి డోన్ పట్టణం సుందరంగా మారింది. గుత్తి రోడ్డులో రుద్రాక్షగుట్ట వద్ద పదెకరాల్లో రూ. 40 కోట్లు వెచ్చించి నిర్మించిన వంద పడకల ఏరియా ఆసుపత్రి ప్రజలకు అందుబాటులోకి రానుంది. అత్యాధునిక వసతులతో కర్నూలు పెద్దాసుపత్రికి దీటుగా నిర్మించిన భవన సముదాయాలను ఆదివారం మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రారంభించనున్నారు. అదేవిధంగా అక్కడే రూ.11కోట్లతో నిర్మించిన ఎస్సీ, బీసీ బాల, బాలికల వసతిగృహ భవనాలను మంత్రి ప్రారంభిస్తారు. ముందుగా పట్టణ నడిబొడ్డున రూ.16కోట్లతో ఆధునిక వసతులతో నిర్మించిన కూరగాయల మార్కెట్, రూ.6కోట్లతో నిర్మించిన క్లబ్ హౌస్, రూ.2కోట్లతో డాక్టర్ రామసుబ్బయ్య పార్కులో నిర్మించిన స్విమ్మింగ్ ఫూళ్లను మంత్రి ప్రారంభిస్తారని వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమాలకు ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి హాజరవుతారన్నారు.

**భారీ బహిరంగ సభ**

అభివృద్ధి పనులు అనంతరం భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బద్దల నాగరాజు, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్‌లు తెలిపారు. పాతబస్టాండ్ నుంచి గుత్తి రోడ్డులోని రుద్రాక్ష గుట్ట వద్ద నిర్మించిన వంద పడకల ప్రభుత్వాసుపత్రి వరకు మంత్రి బుగ్గన పాదయాత్ర చేస్తారన్నారు. ఆసుపత్రి ప్రాంభించిన అనంతరం భారీ బహిరంగా సభ ఉంటుందన్నారు. ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి ప్రారంభోత్సవాల వేడుకలను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు.



ఎస్సీ,బీసీబాల, బాలికల వసతి గృహాలు



పెద్దల స్విమ్మింగ్ ఫూల్



పిల్లలకు ఏర్పాటు చేసిన స్విమ్మింగ్ ఫూల్

# టీడీపీ మాయ మాటలు నమ్మొద్దు

- వైఎస్సార్‌సీపీతోనే అన్ని వర్గాలకు న్యాయం
- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: ఎన్నికలు సమీపిస్తుండటంతో పల్లెల్లోకి టీడీపీ నాయకులు కొత్త డ్రామాలతో వస్తున్నారని, వారి మాయ మాటలు నమ్మొద్దని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి,జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ప్రజలను కోరారు. పెద్దవెంతుర్లలో శనివారం సాయంత్రం రూ.43.60 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని వారు ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఐదేళ్ల పాటు అధికారం ఇస్తే ప్రజలకు ఒక్క మంచి పని చేయకుండా ఎన్నికల దగ్గర పడుతున్న వేల టీడీపీ నాయకులు బాబు ష్యూరిటీ–భవిష్యత్‌కు గ్యారెంటీ అంటూ తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. ఏనాడు ప్రజల బాగోగులు ఆలోచించని టీడీపీకి గ్యారెంటీ లేదని తెలిసే చంద్రబాబు కుట్ర రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామ స్థాయిలోనే సచివాలయ వ్యవస్థ, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్ ఏర్పాటు చేసి ప్రజలు మండల కేంద్రాలకు వెళ్లకుండానే ఉన్న ఊర్లలోనే పనులు జరుగుతున్నాయన్నారు. ఏగ్రామంలో చూసినా ప్రభుత్వ కార్యాలయాలతో కళకళలాడుతున్నాయన్నారు. నియోజకవర్గంలో వంద కోట్లతో జల్‌జీవన్ మిషన్ పథకం కింద అన్ని గ్రామాలకు తాగునీటి సౌకర్యం కల్పించబోతున్నామన్నారు. ఏ ప్రభుత్వంలో మంచి జరిగిందో ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్,ఉపసర్పంచ్ పద్మాంజలిదేవి,లక్షుమ్మ,ఎంపీడీఓ సాయికృష్ణ,వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి,జిల్లా సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు లాయర్ మహేశ్వరరెడ్డి, గ్రామ నాయకులు వెంకటేశ్వరెడ్డి, కొండారెడ్డి, తిరుపంరెడ్డి, సోమిరెడ్డి,రంగయ్య,రామ్మోహన్,నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**పేదలంటే బీసీకి అసూయ**

మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డికి పేదలంటే అసూయ, ద్వేషమని, ఐదేళ్ల పాటు ఎమ్మెల్యేగా ఉన్నా ఏనాడు ప్రజలకు మంచి చేయలేదని,వచ్చే ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కోరారు. టీడీపీ ప్రభుత్వ హాయాంలో జన్మభూమీ కమిటీలు దోచుకుతిన్నాయని ఆరోపించారు. పెద్దవెంతుర్ల గ్రామంలో భర్త బతికుండగానే టీడీపీ నాయకులు వితంతు పింఛన్ తీసుకున్న తీరు ఇందుకు సాక్ష్యమన్నారు. అసైన్‌మెంట్ పథకం కింద గతంలో 150 మందికి భూపంపిణీ చేశామని గుర్తు చేశారు. ఐదేళ్లు ఎమ్మెల్యేగా ఉండి కూడా ఒక్కరికైనా భూపంపిణీ చేపట్టావా బీసీ అని ప్రశ్నించారు. కొలిమిగుండ్ల మండలంలో ప్రతి ఒక్కరికి భూమి ఉండాలనే మంచి ఉద్దేశంతో భూపంపిణీ చేస్తుంటే హైకోర్టుకు వెళ్లి స్టేతీసుకొచ్చిన నీచ చరిత్ర బీసీది అని మండిపడ్డారు. పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేయడంతో అవుకు రిజర్వాయర్ నుంచి గాలేరు నగరి వరద కాల్వ ద్వారా నీటిని విడుదల చేయిస్తే ఓర్వలేని మాజీ ఎమ్మెల్యే బీసీ వైఎస్సార్ కడప జిల్లాకు నీళ్లు అమ్ముకున్నారని తనపై నిందలు వేశారని ధ్వజమెత్తారు.

### ఉపాధి పనులపై బహిరంగ విచారణ



బహిరంగ విచారణ చేపడుతున్న డ్వామా పీడీ రామచంద్రారెడ్డి

ప్యాపిలి: మండల పరిధిలోని వివిధ పంచాయతీల్లో 2022–23 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి హామీ పనులపై శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో బహిరంగ విచారణ నిర్వహించారు. డ్వామా పీడీ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సామాజిక తనిఖీ బృందం సభ్యులు పంచాయతీల వారీగా గ్రామాల్లో చేపట్టిన పనుల వివరాలు వెల్లడించారు. ఉపాధి హామీ, సర్వశిక్ష అభియాన్, పంచాయతీ రాజ్ తదితర శాఖల్లో మొత్తం రూ. 11 కోట్లతో పనులు జరిగినట్లు సామాజిక తనిఖీ బృందం సభ్యులు వివరించారు. పలు గ్రామాల్లో కూలీలు పనులకు వెళ్లకపోయినా వారి ఖాతాల్లో బిల్లులు జమ అయినట్లు సామాజిక తనిఖీ బృందం సభ్యులు తెలిపారు. మొత్తం రూ. 1.38 లక్షలను 15 రోజుల్లోగా రకవరీ చేయాలని డ్వామా పీడీ ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్, ఏపీడీలు అన్వరాబేగం, బాలాజీ నాయక్, శ్రీవిద్య, భాస్కర్ నాయుడు, ఎస్ఆర్పీలు నీలకంఠ, కన్నారెడ్డి, ఏపీఓలు రమణ, నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేడు గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం

బనగానపల్లె: బనగానపల్లె పట్టణంలోని సచివాలయం -1 పరిధిలో ఉన్న ప్రియా గ్రాఫిక్స్, ఎవరెస్టు స్కూల్ ఏరియాలు, ముత్తుమియ్యా కాలనీల్లో ఆదివారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహిస్తారని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆయా కాలనీల్లో విస్తృతంగా పర్యటిస్తారన్నారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంతోపాటు సమస్యలు తెలుసుకుని పరిష్కార చర్యలు చేపడతారని చెప్పారు. ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, సర్పంచ్, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, వార్డు సభ్యులతోపాటు వైఎస్సార్‌సీపీ బూత్ కన్వీనర్లు గృహ సారథులు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, వలంటీర్లు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. తప్పక పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి కోరారు.

### జిల్లాస్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక

కోవెలకుంట్ల: ఆడుదాం ఆంధ్ర పోటీల్లో నియోజకవర్గస్థాయిలో కోవెలకుంట్ల మండల క్రీడాకారులు ప్రతిభ చాటినట్లు ఎంపీడీఓ సయ్యదున్నీసా తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మహిళల క్రికెట్ పోటీల్లో కోవెలకుంట్ల 4వ సచివాలయ క్రీడాకారులు ప్రథమ స్థానంలో నిలిచి రూ. 35 వేలు కైవసం చేసుకోవడంతోపాటు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. అలాగే బాడ్మింటన్ పోటీల్లో కోవెలకుంట్ల 5వ సచివాలయ క్రీడాకారులు సత్తా చాటి రూ. 20 వేలు గెలుపొంది జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. వాలీబాల్ పోటీల్లో కోవెలకుంట్ల 1,2వ సచివాలయ పురుషులు, మహిళల విభాగంలో మూడవ స్థానంలో రూ. 5 వేల చొప్పున, కబడ్డీ పోటీల్లో కోవెలకుంట్ల 2,5 సచివాలయ క్రీడాకారులు మూడవ స్థానంలో రూ.5 వేలు పొందినట్లు పేర్కొన్నారు.

**నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం**

డోన్ టౌన్ : బేతంచెర్ల రోడ్డు జాతీయ రహదారి పనుల కారణంగా మండలంలోని చిన్న మల్కాపురం , రంగాపురం సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు ఆదివారం కరెంటు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 33 కేవీ లైన్ పనుల మార్పు నేపథ్యంలో మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఆ గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వ్యవసాయానికి తెల్లవారు జామున 3 నుంచి 12గంటల వరకు సరఫరా చేస్తామని వివరించారు.

**ఓటు హక్కు వినియోగంపై అవగాహన**

బనగానపల్లె రూరల్ : మండలంలోని మిట్టపల్లె, కాపులపల్లె, ఇల్లూరు కొత్తపేట, గులాంనబీపేట గ్రామాల్లో శనివారం ఆర్ఐ రాఘు వేంద్ర ఆధ్వర్యంలో ఈవీఎం, ఓటు హక్కు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ ప్రదర్శన ద్వారా ఓటు హక్కును ఏ విధంగా సద్వినియోగం చేసుకోవాలి, వేసిన ఓటు ఏవరికి వేశామో తెలుసుకోవడం తదితర అంశాలను ఆర్ఐ రాఘవేంద్ర ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వీఆర్ఓలు మధు, అష్ఫల్, బీఎల్ఓలు మున్నీ, వరప్రసాద్, విశ్వనాథ్‌రెడ్డి, సుభాష్, మహాలక్ష్మీ, వీఆర్ఏలు తదితరులు పాల్గొన్నారు.

**అక్కదేవతల ఆలయ వార్షికోత్సవ వేడుకలు**

కొలిమిగుండ్ల: స్థానిక నాయినపల్లె రోడ్డులో ఉన్న అక్కదేవతల ఆలయ నాల్గవ వార్షికోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. పూజారి రామక్రిష్ణ ఆధ్వర్యంలో అక్కదేవతలను ప్రత్యేకంగా పూలతో అలంకరించి విశేష పూజలు చేశారు. కొలిమిగుండ్లతో పాటు ఇతర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకొని అమ్మవార్లను దర్శించుకున్నారు. దాతల సహకారంతో భక్తులకు అన్నదానం నిర్వహించారు.

**పొదుపు సంఘాలకు చెత్తసంపద కేంద్రాల నిర్వహణ**

కొలిమిగుండ్ల: మండలంలోని అన్ని గ్రామ పంచాయితీల్లో పొదుపు సంఘాల సభ్యులకు చెత్త సంపద కేంద్రాల నిర్వహణ బాధ్యత అప్పగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఎంపీడీఓ సాయికృష్ణ శనివారం తెలిపారు. వీటిపై పొదుపు మహిళలకు అవగాహన కల్పించామన్నారు.

**ముగిసిన మౌలాలి స్వామి ఉరుసు**

ప్యాపిలి: మండల పరిధిలోని పోతుదొడ్డిలో వెలసిన మౌలాలి స్వామి ఉరుసు ఉత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. ఉరుసు ఉత్సవాల్లో భాగంగా స్వామి వారి పీరును గుర్రంపై ఉంచి శనివారం తెల్లవారుజామున గ్రామోత్సవం ప్రారంభించారు. మేళ తాళాల మధ్య ప్రారంభమైన గ్రామోత్సవం గ్రామ పురవీధుల మీదుగా సాగింది. దారి పొడవునా భక్తులు మౌలాలి స్వామికి చక్కెర సమర్పించారు. గ్రామోత్సవం ముగిసిన తర్వాత ఉదయం 10 గంటల ప్రాంతంలో స్వామివారి గుర్రం కొండపైకి ఎక్కింది. ఈ దృశ్యాన్ని చూసేందుకు వచ్చిన భక్తులతో దర్గా ప్రాంతం కిటకిటలాడింది. ఉరుసు సందర్భంగా మౌలాలి స్వామి దర్గాకు రూ. 1.72 లక్షలు ఆదాయం వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు.

# రాజకీయ ఉద్దండులు...డోన్‌కు చేసిందేమీ లేదు!



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



సమావేశానికి హాజరైన ప్రజలు

- డోన్ అభివృద్ధిని ఏనాడైనా ఆలోచించారా
- ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

బేతంచెర్ల: రాజకీయ ఉద్దండులుగా పేరొందని గత పాలకులు డోన్‌కు చేసిందేమీ లేదని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఎద్దేవా చేశారు. గతంలో ఏళ్లతరబడి డోన్‌కు ప్రాతినిధ్యం వహించి మంత్రులు, ఉప ముఖ్య మంత్రి పదవులు అనుభవించారేగాని ఏనాడైనా డోన్ నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధి గురించి కనీసం ఆలోచించారా అని ప్రశ్నించారు. మండల పరిధిలోని గోరుమాను కొండ గ్రామ సమీపాన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం అనంతరం బీసీ బాలుర రెసిడెన్సియల్ స్కూల్, కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సభలో ప్రజలను ఉద్దేశించి మంత్రి ప్రసంగించారు. బీసీ రెసిడెన్సియల్ స్కూలు, కళాశాల, ఐటీఐ, ఎంఎస్ఎంఈ సెంటర్ ఏర్పాటు చేసి గోరుమానుకొండ ఎడ్యుకేషనల్ హబ్‌గా మార్చడతోపాటు గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించామన్నారు. డోన్ నియోజక వర్గంలో పేదలందరికీ సెంటున్నర ఇంటి స్థలం అంటూ డోన్ టీడీపీ ఇన్‌చార్జ్ ప్రగల్భాలు పలకడం ఆశ్చర్యంగా ఉందని, బేతంచెర్ల పట్టణంలో 12 వేల మంది ఇళ్ల పట్టాలకు రూ. 300 కోట్లు ఖర్చు పెట్టడం ఆచరణ సాధ్యమవుతుందా అని నిలదీశారు. అందుబాటులో ఉంటా ఆశీర్వదించండి అంటున్న డోన్ టీడీపీ ఇన్‌చార్జ్ ధర్మవరం సుబ్బారెడ్డి ఎంత మందికి టోపీలు పెట్టారో డోన్ ప్రజలకు బాగా తెలుసని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డి, గోరుమానుకొండ గ్రామ సర్పంచ్ వెంకటేశ్వర్లు, సింగిల్ విండో అధ్యక్షులు నారాయణ, మద్దిలేటి స్వామి ఆలయ చైర్మన్ రామచంద్రుడు, సర్పంచ్‌లు వేణుగోపాల్ రెడ్డి, గుమ్మగాలరాజు, శ్రీరాములు, ఎంపీటీసీలు రామచంద్రారెడ్డి, నాగశేషు, రామనాథం,గ్రూప్ దేవాలయాల చైర్మన్ గుండా జగన్, వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల కన్వీనర్లు తిరుమలేశ్వర్‌రెడ్డి, ఖాజా, నాయకులు నాగరాజు, దస్తగిరి, బళ్లాని సూర్య, యకోబ్ పాల్గొన్నారు.

### ఆటోనగర్ నిర్మాణానికి మంత్రి భూమిపూజ

డోన్ : లారీ, మోటార్ వర్కర్స్ అందరికీ ఒకేచోట పని కల్పించేందుకు ఆటోనగర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని జగదుర్తి సోలార్ కంపెనీ వద్ద 36 ఎకరాలలో మోటార్ మెకానిక్‌లకు షాప్‌ల కోసం స్థలాలు కేటాయిస్తున్నామన్నారు. శనివారం రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములుతో కలిసి ఆయన ఆటోనగర్ ఏర్పాటుకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ బద్దల రాజ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు దొరపల్లె చిరంజీవి, పట్టణ అధ్యక్షుడు కురుకుంద హరి, జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడు పోస్టుప్రసాద్, డోన్ మెకానికల్ అండ్ ఇంజనీరింగ్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ హుసేన్‌బాషా, ఉపాధ్యక్షులు లింగం, పరుశురాం, కార్యదర్శులు గౌస్, సభ్యులు సుభాన్, లక్ష్మణ్, నాయుడు, ఇస్మాయిల్, రంగడు, పీరా, శివ ప్రసాద్, ఖాదర్, వెంకటేష్, మాసుంబాషా, గౌరవాధ్యక్షుడు షేక్, పెయింటర్ మాబు తదితరులు పాల్గొన్నారు.

**సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి**

బేతంచెర్ల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని నగర పంచాయతీ కమిషనర్ రమేష్ బాబు, ఏఓ కిరణ్ కుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని ఓల్డ్ పోలీస్ క్వార్టర్స్ ఆవరణంలో వికసిత భారత్ సంకల్పయాత్రలో భాగంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రొజెక్టర్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు.

**ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి**

కొలిమిగుండ్ల: తాడిపత్రి – బనగానపల్లె రహదారిలో బెలుం సమీపంలో శనివారం ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ రమేష్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. అవుకు మండలం చెర్లోపల్లెకు చెందిన కొమ్ముసాని కొండన్న కుమారుడు కంబగిరి రాముడు (39) అవివాహితుడు. నాపరాళ్ల గనిలో పని చేసే ఇతను శనివారం బైక్‌పై కనకాద్రిపల్లెకు బయలుదేరాడు. మార్గమధ్యలో బెలుం సమీపంలోని అక్కదేవతల గుడి వద్ద బనగానపల్లె ఆర్టీసీ డిపో బస్సు తాడిపత్రి నుంచి వస్తూ ప్రమాదవశాత్తూ ఎదురుగా వస్తున్న కంబగిరిరాముడిపై దూసుకెళ్లడంతో అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాద వివరాలు సేకరించారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

**రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు**

ప్యాపిలి: ఏనుగుమర్రి గ్రామ సమీపంలో ఎన్‌హెచ్ 44పై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో డోన్ పట్టణానికి చెందిన ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. శివ, చిన్న లక్ష్మన్న ద్విచక్రవాహనంపై ప్యాపిలికి వెళ్తుండగా ఏనుగుమర్రి వద్దకు రాగానే వారి వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం వారిని కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై తమకు ఫిర్యాదు అందలేదని ప్యాపిలి పోలీసులు తెలిపారు.

## డోన్ టీడీపీలో పెరిగిన అసమ్మతి సెగ!

డోన్: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో డోన్ టీడీపీలో అసమ్మతి సెగ పెరిగుతోంది. టీడీపీ ఇన్‌చార్జ్ ధర్మవరం సుబ్బారెడ్డిపై అసమ్మతి వర్గీయులు రెచ్చిపోతున్నారు. సోషల్ మీడియా వేదికగా ఇష్టారాజ్యంగా ధర్మవరంపై విమర్శలు గుప్పిస్తున్నారు. అదేవిధంగా బహిరంగంగా కూడా నిలదీస్తున్నారు... నువ్వెంతె... అంటూ ప్యాపిలి మాజీ ఎంపీపీ తొప్పెల శ్రీనివాసులు నిలదీస్తున్నాడు కూడా. టీడీపీ ఆవిర్భావం నుంచి ఎన్నో అష్టకష్టాలు అనుభవించడమే కాక సర్పంచ్ స్థాయి నుండి ప్యాపిలి ఎంపీపీ, జెడ్పీటీసీ పదవులను కూడా తమ కుటుంబం అలంకరించిందన్నారు. కనీసం వార్డు సభ్యునిగానైనా గెలిచావా అంటూ ఎద్దేవా చేయడంతోపాటు పత్రికలకు ప్రకటనలు విడుదల చేశారు కూడా. టీడీపీ అధిష్టానం పొరపాటున ఏకంగా డోన్ ఇన్‌చార్జ్‌గా ప్రకటించడంతో.. వార్డు మెంబర్‌గా కూడా గెలువని ధర్మవరం సుబ్బారెడ్డికి మతి భ్రమిచిందని, అందుకే ఏదేదో వాగుతున్నాడని నిలదీస్తున్నాడు తొప్పెల శ్రీనివాసులు. ఒక్క డోన్ పట్టణంలోనే 16వేల రేషన్‌కార్డులు ఉండగా, ఒక్కొక్క కార్డుదారునికి సెంటున్నర చొప్పున పంచాలంటే 400 ఎకరాలు అవసరం అవుతుందన్నారు. ఇందుకోసం రూ.400కోట్లు వెచ్చించాల్సి ఉంటుందన్నారు. ఇది సాధ్యమేనా అని ప్రశ్నిస్తున్నాడు తొప్పెల శ్రీనివాసులు.